# కాయకన్ను-పూవుకన్ను

ఏ వూరు వెళ్ళినా ఒకసారి ఆ వూర్లో తెలిసినవాళ్ళని కలుసుకోవడం నాకో అలవాటుగా అల్లుకుంది.

ఐదేళ్ళ తరవాత చుట్టపు చూపుకు ఒక పట్నం వెళ్ళాను. శ్రీనివాసులు ఇంటికి వెళ్ళడానికి బయలుదేరితే "వాళ్లావీథిలో లేరని" మా బావ చెప్పాడు.

"స్వంత యిల్లు కదా..."

"అది అమ్మేసారు-రిటైరయిన వెంటనే."

"ఏం?"

"ఇద్దరు కూతుళ్ళ పెళ్ళిళ్ళు చెయ్యడానికి"

"ఇప్పుడెక్కడ?"

"ఇంచుమించు వూరి చివర. అద్దె ఇంట్లో. ఇల్లు కనుక్కోవడం చాల కష్టమవుతుంది. మావాడు ఇల్లు చూపించి వచ్చేస్తాడు" అని కొడుకును తోడిచ్చాడు. ఇద్దరం రిక్షాలో వెళ్ళాం. నిజంగా వూరికి చివరే. ఇంటి దగ్గరకు వెళ్ళడానికి రోడ్డు వున్నా నాలుగు మలుపులు తిరగనిది యిల్లు ప్రత్యక్షం కాదు. నన్ను చూడగానే శ్రీనివాసులు పెళ్ళాంతో సహా ముందుకొచ్చి ఆహ్వానించి లోనికి తీసుకువెళ్ళాడు. ఇల్లు చిన్నదైనా శుభ్రంగా వుంచుకున్నారు. ఇంటి యెదరగా చెట్లు, పూల మొక్కలున్నాయ్.

ఇంట్లో కాలు పెట్టగానే అన్నాను -

"రిటరయిన వెంటనే పెళ్ళిళ్ళకోసం ఇల్లు అమ్మేసారని విన్నాను... ప్రావిడెంటు ఫండ్‌లో ఆ మాత్రమైనా మిగల్లేదా?"

"పిల్లల చదువుల క్రింద అయిపోయింది."

"ఆడపిల్లలకి అంత పెద్ద చదువులు చదివించారు. అయినా కట్నాలు పిండుకున్నారు వాళ్ళు. మగపిల్లలకు అంత పెద్ద చదువులు చదివించారు. వాళ్ళకి ఉద్యోగాలు లేవు..."

ఇంకేదో నేననబోతుంటే శ్రీనివాసులు సహజంగా నవ్వుతూ "ఏరుకు తినే పక్షి యేరుకు తింటేగానీ బ్రతకదు కదా! ఇందులో వింతేముంది?" అనేసాడు.

"మనిషి పక్షిలా వుంటే ఏదో ఒకనాడు ఆ ముక్కుకు ముల్లు గుచ్చుకోదంటారా?" అని నేనంటే దంపతులిద్దరూ నవ్వేసారు.

ఇంతలో అంగట ఒక యెర్రని మారుతికారు ఆగింది. అందులో దిగిన మనిషిని

నేనిదివరకు చూడలేదు. చాలా అట్టహాసంగా కనిపిస్తున్నాడు. కదలుతుంటే కడుపు కూడా కదులుతోంది. వేసిన దుస్తులు ఖరీదైన దిగుమతిచేసిన దుస్తుల్లా వున్నాయ్. కళ్ళద్దాల ఫ్రేమూ ఖరీదైనదే.

"చెల్లెమ్మా! కాఫీ" అంటూనే కాలు పెట్టాడు. నిల్చున్న ముగ్గురం అతను కూర్చుంటేగానీ కూర్చోలేదు. కూర్చున్నాక నావేపు ఒకసారి యెగాదిగా చూస్తుంటే శ్రీనివాసులు నన్ను పరిచయం చేస్తాడనుకున్నాను. చెయ్యలేదు. నేనే చెప్పుకున్నాను. ఇంకా చెప్తూనే వున్నాను. వెంటనే అతను....

"నేనూ శ్రీనివాసులు క్లాసు మేట్సుమి, వాడు గుమాస్తాగా చేరి గుమాస్తాగానే వుండిపోయాడు. నేను విదేశాలు తిరిగి వచ్చాను. వారానికి ఒక్కసారైనా చెల్లెమ్మ చేసిన కాఫీ తాగకపోతే నాకు తృప్తి వుండదు. పని వుంది చెల్లెమ్మా-అర్జంటు" అన్నాడు.

శ్రీనివాసులు భార్య శాంతమ్మ లేచి వంటింటికి వెళ్ళింది. అక్కడ పడివున్న పేపరు ఒకసారి పట్టుకుని చూచి–

"ఎందుకీ ధర్నాలు, ఎందుకీ యెదురు తిరగడాలీ దేశంలో – ఎందుకింత యిన్‌డిసిప్లిన్? మోహన్ దాస్ కరమ్ చంద్ గాంధీ నేర్పిన విద్య యిది" అని, అంతటితో ఆగక వుత్తేజంతో ఒకసారి లేచిపోయి చేయి గుండెపై అన్చి –

"కనీసం నా తరం ఇలాగైనా టెన్షన్స్‌తో బతుకుతోంది. థేంక్ గాడ్! ఈ దేశంలో నా తరవాతి జెనరేషన్సు అన్నీ దోపిడీలకు గురి కావలసిందే. దే విల్ బి రాబ్డ్ ఎట్ అల్ ప్లేసెస్, ఎట్ అల్ టైమ్స్" అంటూ తల కొట్టుకుని పేపరు క్రింద పడేసాడు ఆ వ్యక్తి.

"మీరేం చేస్తున్నారు? ఏం పుచ్చుకుని ఏమిచ్చార"ని అడుగుదామనుకుంటే అతనే మళ్ళీ కూర్చుంటూ ఆవేశంతో...

"మన దేశం పెద్ద చెత్తకుండి-మురుగు దొడ్డి. ఫారిన్‌లో ఒక చెత్తకాగితం ముక్క వెతికినా రోడ్డు మీద దొరకదు. ఎక్కడా కరప్షన్ అన్నది కనపడదు. ఎవడి డ్యూటీ వాడు కాన్షస్‌గా చేస్తాడు. ఇక్కడో? ఎక్కడా కరప్షనే-పెద్దా చిన్నా కక్కుర్తి పడుతున్నాను. తిండికి కక్కుర్తి, తిండి దొరికితే మందు కావాలి, మందు దొరికితే ముండ కావాలి. ఈ రెండింటికోసం అధికారం ఇంతో అంతో వుందని అమాయక ప్రజల్ని దోచుకోవడం. ఈ గొర్రెలు ఏం చెయ్యలేవని తెలుసు ఈ అధికారులకు. జడుస్తారని మరీ జడిపించేస్తారు. ఏ గొర్రెపోతో కొమ్ము విసిరితే దాన్ని యేట వేస్తారు. ఈ కంపు సొసైటీని కాల్చి వేయాలి. అప్పుడే కొత్తసొసైటీ ఈ దేశంలో కొత్తగా మొలుస్తుంది..." అన్నాడు.

ఇంతలో కాఫీ ముగ్గురికి వచ్చింది. మెల్లగా కాఫీని సిప్ చేస్తున్నాడు. కాఫీ ఇచ్చిన ఆనందం అతను అనుభవిస్తుంటే నేనెందుకు మధ్యను ప్రశ్న వెయ్యాలని వూరుకున్నాను. కాఫీ తాగిన వెంటనే నా ధర్మసందేహాలు తీర్చుకుందామంటే నాకు అవకాశం ఇవ్వకుండానే గలగలా మాటల ప్రవాహం.

"మనది కేస్టు బేసెడ్ సొసైటీ. కులం మన సొసైటీకంటిన కేన్సర్. ఈ కేన్సర్‌ని బాగుచేసే మందు మనం కనిపెట్టలేదు. ఈ పొలిటికల్ డాక్టర్లు కబుర్లు

చెప్పినవాళ్లే, కుదుర్చలేరు. డాక్టరు కూడా ఈ కేన్సర్ రోగే అని మరిచిపోకండి. మన శ్రీనివాసులు కట్నాలివ్వడానికి ఇల్లెందుకు అమ్మేశాడు? తన జాతి అల్లుళ్లు కావాలనే కదా! కోరినది ఇచ్చినా, సరిగా ఏలుకుంటాడని ఎక్కడ? ఏలుకోపోతే - వీధిలో పడితే పరువు నష్టం. హెల్ విత్ పరువు. హెల్ విత్ సాంప్రదాయం. మనం మేకలం. మారలేం. తెల్లదొర మేక అయిపోయి పారిపోయాడు గానీ మనం పులులై పారదోలలేదు. అలా చేసినవాళ్లు అల్జీరియన్సు. పులిలాంటి పొలిటీషియన్ పుడితేగానీ ఈ దేశం బాగుపడదు. సర్జనులా పేగులు కోసినవాడే ఈ దేశాన్ని ఆరోగ్యంగా వుంచగలడు!

"నాకే అధికారం ఇస్తే ముందు ఈ బాబాలనందర్నీ కొట్లో తోసేస్తాను. మూఢనమ్మకాలతో మనల్ని నూతిలో కప్పలు చేస్తున్నారు. రోగులెందుకు చచ్చిపోతున్నారీ దేశంలో? అమ్మిన మందులలో మందులు లేవు - మాయ వుంది, మోసం వుంది. తిన్న తిండిలో కంటికి అనని పురుగులున్నాయ్. అంతా బాక్టీరియా మహాత్యం. అందుకే ఈ దేశంలో ఇప్పుడు భూకంపాలు అధికమౌతున్నాయ్. ఎప్పుడో భూమి బ్రద్దలైపోయి..." అంటూ చప్పున చల్లబడిపోయి "వస్తాను" అని నవ్వుతూ వెళ్లిపోయాడు. డ్రైవరు కారు తలుపు తీశాడు. చేతులూపుతూ వెళ్లాడు. అతను వెళ్లాక శాంతమ్మ వంట ఇంటికి వెళ్లింది. శ్రీనివాసులు నేనూ గదిలో కూర్చున్నాము.

"ఎవరీయన?" అన్నాను.

"మనవాడే - మంచివాడు."

"కారున్న వాళ్లంతా మంచివాళ్లా?" అన్నాను నవ్వుతూ.

"అతను అలా ఎబ్బెట్టుగా మాటాడుతున్నాడని అనుకుంటున్నావేమో?"

"అదేపనిగా తన అభిప్రాయాన్నే బల్లగుద్దినట్టు బాదుతుంటే విసుగెత్తదా? కొంపతీసి తాగి వచ్చాడా?"

"తాగడు."

"పై దేశాలు వెళ్లినవాడు తాగడని నమ్మమంటావా?"

"నేను చూడనిది తాగుతాడని నేనెలా చెప్పేది?"

"ఈ వేషం, ఈ కారు అంతా చూస్తుంటే బాగా దోచినవాడిలా వున్నాడు. అలాంటివాళ్లే ఇలాంటి కబుర్లు చెప్తారు సాధారణంగా."

"కష్టపడ్డాడు. గడించాడు. తప్పేంవుంది?"

"గడించి సుఖపడ్తున్నాడా?"

"సుఖం సున్న లాంటిది. మనిషి అంకెలాంటివాడు. మనిషినిబట్టి సుఖానికి విలువ పెరుగుతుంది."

"ఇతని విలువెంత?" అడిగాను సూటిగా.

"నాకు అంకెలే తెలియనప్పుడు అంకెల విలువకట్టగలనా?" అని శ్రీనివాసులు చిరునగవుతో అన్నాడు.

"పోనీ అతగాడు నీలా అరిగిన గంధపు చెక్కా, లేకపోతే విరిగిన చెట్టుకొమ్మా?" అని అడిగాను.

శ్రీనివాసులు అప్పుడే వంట ఇంటినించి వస్తున్న పెళ్లాం వేపు చూసి అన్నాడు:

"ఇప్పుడు వెళ్లిన మీ ఉమాపతి అన్నయ్య అరిగిన గంధపు చెక్కా, విరిగిన చెట్టు కొమ్మా అని మీ తమ్ముడు అడుగుతున్నాడు."

"ఉమాపతి అన్నయ్య ఎప్పుడూ అలా మాటాడుతునే వుంటాడు" అంది నవ్వుతూ ఆమె.

"ఎదుటివాళ్లని మాటాడనివ్వడు - అంతా వాడికే తెలిసినట్టు" అన్నాను.

"ఉమాపతి అన్నయ్యకు పాపం, ఈ కాలానికి చెముడు వచ్చింది. తనకు చెముడుందని ఎదుటివాళ్లు తెలుసుకోకూడదని అలా తనే గట్టిగా మాటాడేస్తుంటాడు." ఈ మాటలు విని నవ్వుకున్నానేగానీ ఆలోచనలో పడ్డాను.

"చెముడు దాచుకోవాలని ప్రయత్నిస్తున్నవాడు... ఇంకెన్నెన్నో అనర్థాలు దాచుకోడానికి ప్రయత్నించవచ్చుకదా..." అనిపించి అదేదో తెలుసుకుందామని శ్రీనివాసుల్ని అడిగాను.

"మందులు మోసం అని అన్నాడంటే...మందులు వాడి మోసపోయాడా?" అడిగాను.

"అది నాకు తెలీదుగానీ... అతని పెళ్లాం పోయి మూడేళ్లయింది."

"మరి జాతిని దుయ్యబట్టాడెందుకు?"

"అందమైన కూతురు. బాగా చదివించాడు. ఎందరో పైజాతి కుర్రాళ్లు చేసుకుంటామని కోరివచ్చారు. కాని జాతి కుర్రాడ్ని వెతికాడు. వెతగ్గా వెతగ్గా దొరికాడు. వాళ్లు కోరినంత ఇచ్చాడు. ఐనా వాడు ఏకు మేకైపోయి పెళ్లాన్ని నానా హింసలు పెట్టాడు. కూతురు యేక్సిడెంట్‌లో చచ్చిపోయిందని తేల్చారు గానీ, బలవంతగా మొగుడే చంపేశాడు."

"కొడుకు లెవరన్నా వున్నారా?"

"ఉన్నవాడొక్కడే. వాడివంతా హైక్లాసు అలవాట్లు. వాళ్లిద్దరిమధ్యా పచ్చగడ్డి వేస్తే భగ్గున మండుతుంది. వేరే వున్నాడు. ఇప్పుడు ఇతను ఒంటరివాడు. అంత పెద్ద ఇల్లు - బోరుగా వుంటుంది. ఇలా మా ఒక్క ఇల్లే కాదు, ఇలా ఎన్ని ఇళ్ళల్లోనో తిరిగి ఇలాగే అంటుంటాడు." చిరునగవుతోనే శ్రీనివాసులు అన్నాడు.

ఉమాపతి అరుచుకుంటూ తన బాధలు దాచుకుంటుంటే, శ్రీనివాసులు నవ్వుకుంటూ తన బాధలు భరిస్తున్నాడనుకున్నాను. అతనిది కాయకన్ను అయితే, ఇతనిది పూవుకన్ను. రెండు కళ్లల్లోనూ నీళ్లు చిమ్ముతాయి.

(ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక, 7-8-1987)

* * *